# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in    ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దిన పత్రిక

సంపుటి : 02    సంచిక : 147    క్రిష్ణా, శనివారం 21- 02 - 2026    పేజిలు : 4    వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# క్వాంటం ఎకో సిస్టంతో..

## ఏపీకి ప్రపంచ స్థాయిలో గుర్తింపు: సీఎం చంద్రబాబు



క్రైం కౌంటర్ న్యూస్, ఢిల్లీ, ఫిబ్రవరి 20 డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు.. క్వాంటం ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' రౌండ్ టేబుల్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ (శుక్రవారం) హాజరయ్యారు.

ఏఐ డేటా హబ్‌గా విశాఖపట్నం..

వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరై.. తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. సమీప భవిష్యత్‌లో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుందని చెప్పుకొచ్చారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు.

ఎకో సిస్టం రూపకల్పన చేస్తున్నాం..

ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టం రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని.. దేశం దాన్ని సాధించి తీరుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మన వారసత్వాన్ని నిలబెట్టే జ్ఞాన మందిరం

## అమరావతి స్టేట్ సెంట్రల్ లైబ్రరీ"

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 20: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు ప్రజా రాజధాని అమరావతిలో నిర్మించనున్న స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించేలా ఉండాలని అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అమరావతిలో ప్రతిపాదిత స్టేట్ సెంట్రల్ లైబ్రరీ నమూనాను పరిశీలించి, నిపుణులు రూపొందించిన ప్రెజెంటేషన్ వీడియోను వీక్షించారు. లైబ్రరీ నిర్మాణంపై పలు సూచనలు చేస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో దీన్ని సమగ్ర జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఘన చరిత్ర, వారసత్వానికి ప్రతీకగా నిలిచేలా ఈ లైబ్రరీ రూపుదిద్దుకోవాలని, ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా రూపకల్పన చేయాలని మంత్రి సూచించారు. ఆర్కైవ్స్, ఆడిటోరియం సౌకర్యాలతో పాటు 15 లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి తోడ్పడే విధంగా, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా జ్ఞాన వేదికగా దీన్ని తీర్చిదిద్దాలని అన్నారు. ఇందుకు అవసరమైన మొత్తం ఎకోసిస్టమ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పదో



తరగతి పరీక్షల నిర్వహణ, అభ్యసన సామర్థ్యాల పెంపుపై కూడా చర్చ జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలు పురోగతి, క్లిక్కర్ వీడియోల వినియోగం, పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. విద్యార్థుల హాజరు, మార్కులు తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రవేశపెట్టిన 'లీప్ యాప్'ను ఎంతమంది తల్లిదండ్రులు డౌన్‌లోడ్ చేసుకున్నారో మంత్రి ఆరా తీశారు. తల్లిదండ్రుల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# లోకేశ్ విందులో రాజకీయ ఏకత్వం.. కుటుంబ విలువల ప్రతిబింబం.




క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 20 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల మధ్య సమన్వయం కేవలం పాలనకే పరిమితం కాకుండా, కుటుంబ బంధాలను బలోపేతం చేసే దిశగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విందు సమావేశం దీనికి నిదర్శనంగా నిలిచింది.

కుటుంబ విలువల ప్రతిబింబం..

మంత్రి నారా లోకేశ్ తన నివాసంలో కూటమి ప్రజాప్రతినిధుల కోసం వరుసగా విందు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇవాళ (శుక్రవారం) రాజమహేంద్రవరం, నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులతో ఉండవల్లి నివాసం సందడిగా మారింది.

మూడు పార్టీలు.. ఒకే కుటుంబం..

ఈ విందు కేవలం రాజకీయ చర్చలకే పరిమితం కాలేదు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ప్రజాప్రతినిధులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. 'కూటమి అంటే కేవలం మూడు పార్టీల కలయిక కాదు, ఇదొక పెద్ద కుటుంబం' అనే సందేశాన్ని ఈ సమావేశం చాటిచెప్పింది. కృష్ణా నది ఒడ్డున సాగిన ఈ ఆతిథ్యం గోదావరి జిల్లాల అతిథులకు సరికొత్త అనుభూతిని మిగిల్చింది.

విందులో వెల్లివిరిసిన సందడి

ఉండవల్లి నివాసం ఒక ఉత్సవ వాతావరణాన్ని తలపించింది. రాజకీయాలకు అతీతంగా వ్యక్తిగత విషయాలపై నేతలు చర్చించారు.


2లో


# ఏఐ సమ్మిట్‌లో టెక్ కంపెనీల సీఈవోలతో చంద్రబాబు భేటీ



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 20: ఏఐ సమ్మిట్‌లో టెక్ కంపెనీల సీఈవోలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలేతో, అరామ్‌కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహ్మాన్ ఐతుక్కైర్‌తో, లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్‌తో, ఆధార్ ఫౌండర్ సీటీవో శ్రీకాంత్ నాదమునితో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం రీసెర్చ్ ఇండియా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అమిత్ సింఘీతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు.

# జగన్ హయాంలో రైతన్నలని పట్టించుకోలేదు..

## మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం



క్రైం కౌంటర్ న్యూస్, గుంటూరు జిల్లా, ఫిబ్రవరి 20 వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో అన్నదాతలని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. రైతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. జగన్ హయాంలో అన్నదాతలు అనేక కష్టాలు పడ్డారని చెప్పుకొచ్చారు. ఇవాళ (శుక్రవారం) గుంటూరు మిర్చి యార్డ్ నూతన పాలకమండలి ప్రమాణస్వీకార మహోత్సవం జరిగింది. చైర్మన్‌గా కుర్రా అప్పారావు, వైస్ చైర్మన్‌గా బిట్రగుంట మల్లిక ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీతో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నక్కా ఆనంద బాబు, చదలవాడ అరవింద్ బాబు, బూర్ల రామాంజనేయులు, భాష్యం ప్రవీణ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, పలువురు కార్పొరేషన్ చైర్మన్‌లు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు, మిర్చి యార్డ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి కూటమి శ్రేణులు పోటెత్తారు.

మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. గుంటూరు మిర్చి యార్డ్ అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వ్యాఖ్యానించారు. ఏపీలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన మార్కెట్ గుంటూరు మిర్చి యార్డ్ అని పేర్కొన్నారు. మిర్చి రైతుల పెట్టుబడి ఇబ్బందులు, నష్టాలను అరికట్టేందుకు కృషిచేస్తామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడాలంటే రైతులు పురుగు మందుల వాడకం తగ్గించి.. నాణ్యమైన దిగుబడి సాధించడంపై దృష్టి సారించాలని వివరించారు. సిటీ నడిబొడ్డుకు చేరిన యార్డ్ మార్పుపై నివేదిక ఇస్తే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మార్కెట్ యార్డ్ సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తామని మాటిచ్చారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం..

## సిట్ నివేదికపై ఏకసభ్య కమిటీ ఏర్పాటు..

క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 20 తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన


2లో

# సవ్యంగా సాగని ఏకీకృత సర్వే

**పూర్తివివరాలు చెప్పడానికి ప్రజలు విముఖం**
**సంక్షేమ పథకాలు వర్తించవేమోననే ఆందోళనే కారణం**
**సర్వే కోసం ఇళ్లకు వెళ్లకుండా సచివాలయాలకు కుటుంబ సభ్యులను పిలిపించుకుంటున్న కొంతమంది సిబ్బంది**
**కొన్నిచోట్ల గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లలోకి సిబ్బందిని అనుమతించని పరిస్థితి**
**సర్వేలో 20వ స్థానంలో విశాఖ జిల్లా**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం/అక్కయ్యపాలెం/జ్ఞానాపురం,ఫిబ్రవరి 20 కుటుంబ వివరాల సేకరణ కోసం చేపడుతున్న ఏకీకృత (యూనిఫైడ్) సర్వే పక్కాగా సాగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్వేలో అడుగుతున్న ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పడానికి చాలామంది విముఖత చూపుతున్నారు. మొత్తం వివరాలు చెబితే...ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు ఎక్కడ ఆగిపోతాయోనన్న సందేహంతో అరకొర సమాచారం ఇస్తున్నారు. ఇక నగరంలో అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, అధిక ఆదాయం ఉన్న ప్రాంతాల్లో సర్వేకు అక్కడ నివాసితులు ఆసక్తి చూపడం లేదు. ఇదే సమయంలో కొన్నిచోట్ల సచివాలయాల సిబ్బంది ఇళ్లకు వెళ్లకుండా ప్రజలను సచివాలయాలకు రప్పించుకుంటూ సర్వే పూర్తిచేస్తున్నారు.
రాష్ట్రంలో ప్రతి కుటుంబం వివరాల కోసం ఏకీకృత సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్వే బాధ్యతను గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి అప్పగించింది.
విశాఖ జిల్లాలో 607 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా వాటిల్లో 4,532 మంది పోస్టులకుగాను 4,249 మంది పనిచేస్తున్నారు. జిల్లాలో 7,13,060 కుటుంబాలు ఉన్నాయి. సర్వేలో భాగంగా ప్రతి కుటుంబం నుంచి పూర్తివివరాలు సేకరించాలి. ప్రతి ఒక్కరి నుంచి 25 అంశాలపై వివరాలు తీసుకోవాలి. పేరు, స్థానికులా?, కాదా?, వృత్తి, ఆదాయం, సామాజిక స్థితిగతులు, సంక్షేమ పథకాలు అందుతున్నాయా?, పింఛన్, బియ్యం కార్డు, ఇతర పథకాలు, సొంత ఇల్లు, మౌలిక వసతులు, జీవన వి?ధానం, ఇంట్లో వినియోగించే వస్తువులు...ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, టీవీ, ఏసీ, ఇతర గృహోపకరణాలు, స్మార్ట్ ఫోన్ల వివరాలు నమోదుచేయాలి. ఒక ఇంట్లో ఎంతమంది ఉన్నా...అందరి నుంచి ఈ వివరాలు నమోదుచేయాలి. ఇంకా కుటుంబం మొత్తానికి కలిపి మరికొన్ని ప్రశ్నలకు సమాధానాలు తీసుకోవాలి. ప్రతి కుటుంబం తమ సచివాలయానికి అనుసంధానం కావాలి. దీనినే మ్యాపింగ్ అంటారు. మ్యాపింగ్ జరిగితేనే అన్నిరకాల సర్టిఫికెట్లు, చివరకు భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుంది.
అయితే సర్వేలో మొత్తం వివరాలు చెబితే సంక్షేమ పథకాలు ఎక్కడ నిలిచిపోతాయేమోనన్న కారణంతో చాలామంది వాస్తవాలు చెప్పడం లేదు. పింఛన్, బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు రద్దు అవుతాయేమోననే భయంతో తప్పుడు సమాచారం అందిస్తున్నారు. అధిక ఆదాయం కలిగిన కుటుంబాలు నుంచి సమాచారం రావడం లేదు. సచివాలయానికి ఆ ప్రాంతంలో నివసించే కుటుంబాలను మ్యాపింగ్ చేయడం తప్పనిసరి అని చెప్పినా వినడం లేదని సిబ్బంది వాపోతున్నారు. పాండురంగాపురం, కిర్లంపూడి లేఅవుట్, సీతమ్మధారలోని కొన్ని ప్రాంతాల్లో సర్వేకు కొందరు సహకరిస్తున్నా, మరికొందరు పూర్తివివరాలు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరంలోని కొన్ని సచివాలయాల సిబ్బంది ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తుండగా, మరికొన్ని సచివాలయాల సిబ్బంది ఆయా కుటుంబ సభ్యులకు ఫోన్‌లు చేసి తమ కార్యాలయానికి రప్పించుకుంటున్నారు. ఎవరినీ సచివాలయాలకు పిలిపించుకోవద్దని, సిబ్బంది తప్పనిసరిగా ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చామని జిల్లా గ్రామ/వార్డు సచివాలయాల అధికారి ఉషారాణి స్పష్టంచేశారు. ప్రజలు కూడా సర్వే నిమిత్తం వచ్చే సచివాలయాల సిబ్బందికి సహకరించాలన్నారు. సచివాలయంతో కుటుంబం మ్యాపింగ్ కాకపోతే సర్టిఫికెట్లు మంజూరు, ప్రభుత్వం నుంచి అందే సేవలకు ఇబ్బంది ఉంటుందన్నారు. కాగా గురువారం నాటికి జిల్లాలో 7,13,060 కుటుంబాలకుగాను 4,42,618 (62.07 శాతం) కుటుంబాల సర్వే పూర్తిచేశారు. గ్రామీణ ప్రాంతంతో పోల్చితే నగరంలో కొంత వెనుకబడి ఉన్నందున రాష్ట్రంలో విశాఖ జిల్లా 20వ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో సర్వేను వేగవంతం చేయాలని సచివాలయాల సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

# పంచాయతీ కార్యదర్శులపై కొరడా

**లక్ష్యానికి దూరంలో ఇళ్ల పన్నుల వసూళ్లు**
**బకాయిలతో కలిపి రూ.51.85 కోట్లు డిమాండ్**
**ఇంతవరకు వసూలైంది రూ.24 కోట్లు మాత్రమే**
**లక్ష్య సాధనలో వెనుకబడిన 274 మంది కార్యదర్శులకు నోటీసులు**

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 20: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు ముందుకు సాగడం లేదు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడంలేదు. ఇందుకు సంబంధిత ఉద్యోగుల నిర్లక్ష్యమే కారణమని ఉన్నతాధికారులు భావించి, ఇంటి పన్ను వసూళ్లలో బాగా వెనుకబడిన 274 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరికొందరికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.
జిల్లాలో వున్న 646 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.8 కోట్ల మేర ఇంటి పన్నులు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి రూ.43.85 కోట్లు కలిపి మొత్తం రూ.51.85 కోట్లు వసూలు చేయాలి. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత ఏడాది జూన్ నుంచి గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి నూరు శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ గత నెలలో అనకాపల్లిలో నిర్వహించిన సమావేశంలో సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ విజయకృష్ణన్ సైతం పంచాయతీల్లో ఇళ్ల పన్నుల వసూళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఆమె ఆదేశాల మేరకు డీపీవో సందీప్ రోజూ మండల స్థాయిలో అధికారులతో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. కానీ అధికారులు ఆశించిన స్థాయిలో పన్నుల వసూళ్లు జరగడంలేదు. ఈ నె 19వ తేదీ నాటికి రూ.24 కోట్లు (46.28 శాతం)



మాత్రమే వసూలు చేయగలిగారు. ఇంకా రూ.27.85 కోట్లు వసూలు చేయాల్సి వుంది. పరవాడ, దేవరాపల్లి మండలాల్లో మాత్రమే 80 శాతానికిపైగా పన్ను వసూళ్లు జరిగాయి. అనకాపల్లి, మునగపాక మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయి. ఈ మండలాల్లో 30 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. దీంతో పన్నుల వసూళ్లలో బాగా వెనుకబడిన 274 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత ఏడాది జూన్ నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నపప్పటికీ లక్ష్యం మేరకు పన్నులను వసూలు చేయడంలో ఎందుకు విఫలమయ్యారో పది రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. జిల్లాలోని పంచాయతీల్లో ఇళ్ల పన్నులను కనీసం 50 శాతం కూడా వసూలు చేయకపోవడాన్ని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా.. మార్చి నెలాఖరులోగా నూరు శాతం పన్ను వసూలు చేయాలని ఆయా పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

# లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం.. రిటైర్డ్ ఐఏఎస్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 20: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై అధ్యయనం జరిపి 45 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని దినేష్ కుమార్‌ను ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన పరిపాలన లోపాలు, టెండర్లపై సమగ్ర పరిశీలన చేసి ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించనుంది.
ఏకసభ్య కమిషన్ ఏర్పాటుపై వైసీపీ రియాక్షన్ మరోవైపు తిరుమల లడ్డూ అంశంలో ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడంపై వైసీపీ స్పందించింది. ఈ విషయంపై వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయంపై భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై చంద్రబాబుకు నమ్మకం లేదని భూమన విమర్శించారు. సీబీఐ సిట్ నివేదిక తమకు అనుకూలంగా రాలేదు కనుకే.. ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారని భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు కుట్రలను తిరుమల శ్రీవారు బయటపెట్టారంటూ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు.తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై సీబీఐ సిట్ నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా అధికార, విపక్షాల మధ్యన మాటలయుద్ధం జరుగుతోంది. నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ సిట్ నివేదిక చెప్పిందంటూ వైసీపీ చెప్తుండగా.. కల్తీ జరిగినట్లు నివేదిక ద్వారా స్పష్టమైందని ప్రభుత్వం వాదన. ఈ నేపథ్యంలోనే ఇటీవల విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసిన కూటమి పార్టీలు.. ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విలేకర్ల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. తిరుమల లడ్డూలో కల్తీకి సంబంధించి అసలు దోషులను గుర్తిస్తామన్న చంద్రబాబు.. సీబీఐ సిట్ తమకు పంపిన నివేదికపై ఏకసభ్య కమిషన్ ద్వారా అధ్యయనం జరుపుతామని ఇటీవల ప్రకటించారు. ఈ క్రమంలోనే రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. 45 రోజుల్లోగా సీబీఐ నివేదికతో పాటుగా ఇతర అంశాలపై అధ్యయనం జరిపి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## లోకేశ్ విందులో రాజకీయ ఏకత్వం..
## కుటుంబ విలువల ప్రతిబింబం.

కూటమి ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నివాస ప్రాంగణంలో పిల్లల ఆటపాటలతో సందడి నెలకొంది.
లోకేశ్‌కు ప్రత్యేక కానుకలు..
ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు లోకేశ్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రాజమండ్రి 'రత్నం పెన్'ను లోకేశ్‌కు బహూకరించారు.
ఎంబ్రాయిడరీ చిత్రం..
లోకేశ్ – బ్రాహ్మణి దంపతుల చిత్రాన్ని వస్త్రంపై ఎంతో ఓపిగ్గా ఎంబ్రాయిడరీ చేయించి.. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కానుకగా ఇచ్చారు. ఈ అపురూప కానుక లోకేశ్‌ను విశేషంగా ఆకట్టుకుంది.
మంగళగిరి పట్టుచీరల ఆత్మీయత..
విందు అనంతరం లోకేశ్ దంపతులు తమ అతిథులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. మహిళా అతిథులందరికీ మంగళగిరి నేతన్నల నైపుణ్యానికి గుర్తింపుగా మంగళగిరి పట్టు చీరలను లోకేశ్ స్వయంగా కానుకగా అందజేశారు. ఇది నేతన్నలకు మద్దతు తెలపడంతో పాటు అతిథుల పట్ల గౌరవాన్ని చాటినట్లయింది.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం..
## సిట్ నివేదికపై ఏకసభ్య కమిటీ ఏర్పాటు..

నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఈ ఏకసభ్య కమిటీని ఏపీ సర్కార్ నియమించింది. ఈ కమిటీ ప్రధాన బాధ్యత.. సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం.
ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం, ఈ ఏకసభ్య కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిట్ నివేదికలో ఉన్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, అవసరమైతే అదనపు వివరాలను సేకరించి.. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది. తిరుమలలో శ్రీవారి లడ్డూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు. అలాంటి పవిత్ర ప్రసాదం విషయంలో కల్తీ ఆరోపణలు రావడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసింది.
సిట్ ఇప్పటికే లడ్డూ తయారీ ప్రక్రియ, ముడి సరుకుల సరఫరా, నాణ్యత నియంత్రణ వ్యవస్థ, సంబంధిత అధికారుల పాత్ర వంటి అంశాలపై విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదిక ఆధారంగా ఇప్పుడు ఏకసభ్య కమిటీ మరింత సమగ్రంగా విశ్లేషణ చేయనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# తరుగు పేరుతో దగా

**శనగ రైతులు దోచుకుంటున్న వ్యాపారులు**
**ప్రభుత్వం కొనుగోలు చేయాలని వినతి**

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 20: సంజామల, ఫిబ్రవరి 20 మండలంలో ఈ రబీ సీజన్‌కు 16వేల ఎకరాల్లో శనగ సాగు చేశారు. ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతులు సంతోషించారు.
మార్కెట్ సదుపాయం లేక నష్టం..
శనగకు విక్రయించేందుకు జిల్లాస్థాయిలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.5,875ల మద్దతు ధర ప్రకటించినా ఇంతవరకు కొనుగోలు ప్రారంభం కాలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు క్వింటాకు రూ5వేలకు విక్రయిస్తున్నారు.
అనామతు పద్ధతితో నష్టం...
నాలుగు దశాబ్దాల కాలం నుంచి వ్యాపారులు అనామతు విధానం అనుసరిస్తూ రెతుకు నష్టం చేస్తున్నారు. ఉగాదిలోపు శనగలను రైతు విక్రయించుకుంటే గోదాము ఖర్చు లేకుండా అప్పటి మార్కెట్ ధర ప్రకారం మొత్తాన్ని రైతుకు కొంత మొత్తాన్ని అందజేస్తారు. ఉగాది దాటాక గోదాముల ఖర్చు కింద బస్తాకు రూ.వంద చెల్లించాల్సి ఉంటుంది. ధర వచ్చినప్పుడు శనగలను అమ్మి రైతుకు అందజేస్తారు.
50కేజీల బస్తాకు 3 కేజీల వరకు..
వ్యాపారులు 50 కేజిల శనగలకు 2 నుంచి 3 కేజిలు తరుగు పేరుతో లాగేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో 24 గ్రామాలకు కలిపి 25 నుంచి 30 మంది దళారి వ్యాపారులున్నారు. ధాన్యం కొనుగోలులో వీరి పెట్టుబడి కేవలం సంచులు, హమాలీల ఖర్చులు మాత్రమే. ఆరుగాలం కష్టించి పనిచేసే రైతు కంటే వీరికే రూ. లక్షల్లో లాభం వస్తోంది.
50 కేజీలకు 2 కేజీల తరుగు తీస్తున్నారు
నాలుగు ఎకరాల్లో శనగ సాగు చేశాను. 32 బస్తాల దిగుబడి వచ్చింది. డబ్బు అవసరమై క్వింటా రూ 5వేల ప్రకారం విక్రయించాను. వ్యాపారి 50 కిలోల శనగలకు 2 కిలోల ప్రకారం తరుగు తీసుకున్నారు. ఈ లెక్కన 30 క్వింటాళ్లకు 120 కిలోల శనగ నష్టపోయాను. – హుస్సేనయ్య, రైతు, గిద్దలూరు.
కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
మూడు ఎకరాలలో సాగు చేశాను. ఈ ఏడాది పంట బాగా పండి, ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే దళారి వ్యాపారులకు విక్రయించాలంటే భయం వేస్తుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మద్దతు ధరకే విక్రయిస్తాను.

# ఒక్క క్లిక్‌తో ఖాతాలు ఖాళీ

**విజృంభిస్తున్న సైబర్ నేరగాళ్లు**

**ఆయాచిత ఆదాయం, ఉద్యోగాలు ఆశ చూపించి ఆన్‌లైన్‌లో మోసాలు**

**డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెట్టి మరీ దోపిడీ**

**జిల్లాలో 13 నెలల్లో 57 సైబర్ క్రైమ్ కేసులు నమోదు**

**బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రూ.5.24 కోట్లు**

**పోలీసుల ద్వారా బాధితులకు తిరిగి చేరింది రూ.36.12 లక్షలే!**



క్రైం కౌంటర్ న్యూస్,నర్సీపట్నం, ఫిబ్రవరి 20 సైబర్ నేరస్థులు సామాజిక మాధ్యమాలను అడ్డాగా చేసుకొని ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఇంటి నుంచే ఉద్యోగం చేసి, వేలాది రూపాయలుసంపాదించ వచ్చు అంటూ సోషల్ మీడియాలో పోస్టుల ద్వారా వల విసురుతున్నారు. నిజమేనని నమ్మిన పలువురు తమ వివరాలను సైబర్ నేరగాళ్లకు (మోసగాళ్లని తెలియక) అందించి, ఆనక నిండా మోసపోతున్నారు. మరో వైపు విశ్రాంత ఉద్యోగులను డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను కొల్లగొడుతున్నారు. అనకాపల్లి జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 57 మంది సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ.5.24 కోట్లు పోగొట్టుకొన్నారు.

గత సంవత్సరం నర్సీపట్నం ప్రాంతానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగికి పోలీస్ వేషధారణలో వున్న సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి, డిజిటల్ అరెస్టు పేరుతో వారం రోజులపాటు భయపెట్టి ఆయన బ్యాంకు ఖాతా నుంచి కోటి రూపాయలకు పైగా లాగేశారు. రెండు నెలల క్రితం నర్సీపట్నానికి చెందిన విశ్రాంత గిరిజన ఉపాధ్యాయుడుని కూడా డిజిటల్ అరెస్టు పేరుతో మూడు రోజులపాటు తీవ్ర భయాందోళనకి గురి చేశారు. ఆయన బ్యాంకు ఖాతాలో వున్న రిటైర్మెంట్ డబ్బులను దోచేయడానికి ప్లాన్ వేశారు. తొలుత భయపడిన ఆయన సైబర్ నేరగాళ్లు చెప్పిన బ్యాంకు ఖాతా నంబర్‌కు తొలుత రూ.20 వేలు పంపించారు. సైబర్ నేరగాళ్లు అడిగిన మిగిలిన నగదును డ్రా చేయడానికి బ్యాంక్‌కు వెళ్లారు. ఆయన తీవ్ర ఆందోళన చెందుతుండడం, ఒకేసారి పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేస్తుండడంతో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి ఆయనతో మాట్లాడారు. విషయం తెలుసుకొని నగదును విత్‌డ్రా చేయకుండా ఆపగలిగారు. ఆయన బ్యాంకు ఖాతాను తాత్కాలికంగా ఫ్రీజ్ చేసి, భయపడవద్దని ధైర్యం చెప్పి ఇంటికి పంపించారు. దీంతో సదరు విశ్రాంత ఉపాధ్యాయుడు సైబర్ మోసం నుంచి త్రుటిలో తప్పించుకొన్నారు.

నర్సీపట్నం రామారావుపేటకు చెందిన ఇంజనీరింగ్ చేసిన యువతి.. ఉద్యోగం కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో వెతుకుతూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడింది. టాస్కుల పేరుతో ఆమెను మోసం చేసి దఫదఫాలుగా రూ.4 లక్షలు కాజేశారు. గత ఏడాది ఇదే తరహాలో నీలంపేటకు చెందిన ఒక మహిళ.. ఉద్యోగం కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో వెతుకుతూ సైబర్ వలకు చిక్కుకొని డబ్బులు పోగొట్టుకొన్నారు.

13 నెలల్లో 57 సైబర్ నేరాలు, రూ.5.24 కోట్లు దోపిడీ

గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ వరకు అనకాపల్లి జిల్లాలో 57 సైబర్ నేరాలు జరిగినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటికి సంబంధించి రూ.5.24 కోట్ల సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. అయితే తాము మోసపోతున్నట్టు కొంతమంది బాధితులు త్వరగా గుర్తించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమై రూ.1,04,42,618 నగదు సైబర్ నేరగాళ్ల ఖాతాలకు జమ కాకుండా ఆపగలిగారు. నమోదైన కేసులకు సంబంధించి రూ.36.12 లక్షలు రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

పోలీసులు విస్తృత ప్రచారం

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహీన్‌సిన్హా ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సైబర్ క్రైమ్ పోర్టల్, 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. ఇంకా ఏకేపీ ఫైల్స్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని హెచ్చరిస్తున్నారు. డిజిటల్ అరెస్టులు బోగస్ అని, ఎవరైనా ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు అంటే నమ్మవద్దని సూచిస్తున్నారు. ఫోన్లను హ్యాక్ చేసి సోషల్ మీడియా గ్రూపుల్లో లింకులు, మెసేజలు పంపుతారని, అటువంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. అదే విధంగా ఇటువంటి వాటిని ఇతర గ్రూపుల్లో ఫార్వర్డ్ చేయవద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల మోసాల విషయంలో చాలా మంది అప్రమత్తంగానే వుంటున్నప్పటికీ కొద్ది మంది మాత్రం భయం లేదా అత్యాశతో మోసపోతున్నారని పోలీసు అధికారులు చెబుతున్నారు.

# కొబ్బరికి దెబ్బ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

క్రైం కౌంటర్ న్యూస్, తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 20 కొబ్బరి ధర పతనమైంది. తమిళనాడు నుంచి ఇబ్బడి ముబ్బడిగా దిగుమతితో పాటు, పండగలు లేక పోవడం దీనికి ప్రధాన కారణంగా వ్యాపా రులు చెబుతున్నారు. నిలువ చేసిన కొబ్బరి కాయలకు పాడైపోవ డంతో అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో రైతుల వద్ద నుంచి కొనుగోళ్లు ఆగిపోయాయి. ఇప్పుడు 1000 కొబ్బరికాయలు సైజును బట్టి 8 వేల నుంచి రూ.16 వేల మధ్య విక్రయాలు జరుగుతున్నాయి. గతంలో 1000 కాయలు రూ. 18 వేలు నుంచి 24 వేలు వరకు హోల్‌సేల్‌గా కొనుగోలు చేశారు. వాటిని రిటైల్‌గా కాయి రూ.25 నుంచి 30 వరకు విక్రయించే వారు. హోల్‌సేల్‌గా ధర పడినా రిటైల్‌గా వ్యాపారులు ధర తగ్గించడం లేదు. కొబ్బరి కాయ సైజ్‌ను బట్టి రూ.20 నుంచి రూ.30 అమ్ముతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాలోనే ఎక్కువ..

కొబ్బరి సాగు విస్తీర్ణం పాత ఉభయ గోదావరి జిల్లాలోనే ఎక్కువ. రాష్ట్ర మొత్తం సాగులో ఈ రెండు జిల్లాలో 50 శాతం సాగు ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అంబాజీపేట, కొత్తపేట, బొబ్బర్లంక, కటారిలంక, ఊడిమూడి, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు, యలమంచిలి, ఖండవల్లి, పెరవలి, మెట్టుప్పరగూడెం, అమృతపురం, కడియద్ద, దెందులూరు, పెదవేగి. ద్వారకాతిరుమల మండలాల్లో సాగు ఎక్కువగా ఉంది.

తమిళనాడు నుంచి దిగుమతి

ఇక్కడ విస్తీర్ణం ఎక్కువగా ఉన్నా తమిళ నాడు నుంచి దిగుమతి పెరిగింది. దీంతో ధరలు పడిపోయాయి. దీనికి తోడు ఇప్పుడు పండగులు కూడా లేకపోవడంతో ధరలు పడిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. వివాహాది శుభ కార్యక్రమాలకు తక్కువ శాతం మాత్రమే విని యోగం అవుతుందని, అది కాకుండా పండుగల సమయంలో వినియోగం ఎక్కువ అని చెబు తున్నారు. ఇలాంటి సమయంలో రైతుకు గిట్టుబాటు కాకపోయిన అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అయితే కురిడీ కొబ్బరి ధరలు మాత్రం స్థిరంగానే ఉన్నాయి.



ఇవి 1000 రూ.28 వేలకు విక్రయిస్తున్నారు. దీన్ని ఎక్కువగా కొబ్బరి నూనెకు వినియోగిస్తుంటారు.

మహారాష్ట్రలోనూ ధర పతనం

మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాలో కూడా మన కొబ్బరికి డిమాండ్ లేదు. అక్కడ వారు 1000 కొబ్బరి కాయలు హోల్‌సేల్‌గా రూ.14 వేలు మించి కొనుగోలు చేయడం లేదు. మహారాష్ట్రలోని సోలాపూర్, బసవగుళ్ల ప్రాంతాలకు ఇక్కడ నుంచే ఎగుమతి అవుతుంటుంది. చత్తీస్‌గడ్ వ్యాపారులు కూడా ఇదే ధరకు అడగడంతో రైతుల వద్ద నుంచి తక్కువకు కొనుగోలు చేయాల్సి వస్తుంది.

మంచు, చలికి కుళ్లుతున్న కొబ్బరి

వీరవల్లి శివ, గంగాధర కోకోనట్, అత్తిలి

మంచు, చలికి కొబ్బరి నిలువకు ఆగడం లేదు. గతంలో డిమాండ్ ఉందని పచ్చికాయలను కొనుగోలు చేసి నిలువ చేశాం. ఇప్పుడు కొబ్బరి కుళ్లిపోయే అవకాశం ఉంది. దీంతో అయినకాడికి అమ్మేయాల్సి వస్తుంది. ఏప్రిల్ మాసం తరువాత మాత్రమే కొబ్బరి నిలువకు ఆగుతుంది. కొబ్బరి వ్యాపారం కూడా నష్టాల బాటలో నడుస్తున్నది

# తమ భూములకు రహదారి కోసం ప్రభుత్వ భూమి కబ్జా



**కొండలను దొలిచి, గెడ్డలను కప్పి రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం**

**కళ్లు మూసుకున్న రెవెన్యూ యంత్రాంగం**

**స్థానికుల ఫిర్యాదుతో కదలిక**

**ఆ భూములు గతంలో గిరిజనుల వద్ద ఓ వైసీపీ సర్పంచ్ కొనుగోలు**

**ఐదేళ్ల క్రితం చేతులు మారిన వైనం**

**వాటిల్లోనూ ప్రభుత్వ భూములు ఉన్నట్టు ఆరోపణలు**

క్రైం కౌంటర్ న్యూస్, ఆనందపురం, ఫిబ్రవరి 20 అనకాపల్లి జిల్లాకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఒకరు ఆనందపురం మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాకు తెగబడ్డారు. కొండలను తొలిచి, గెడ్డలను పూడ్చి తమ భూములకు దర్జాగా రహదారి నిర్మించుకున్నారు. అడ్డుకోవలసిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని ఒక సర్పంచ్ (వైసీపీ) నాలుగు కొండల నడుమ గల కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గ్రామంలో గిరిజనులను అదిరించి, బెదిరించి కొన్నేళ్ల క్రితం వారి భూములను (సుమారు 15 ఎకరాలు) కొనుగోలు చేశారు. ఆ చుట్టుపక్కల గల ప్రభుత్వ భూములను, గెడ్డలను కూడా కలిపేసుకున్నానే ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ఆ భూములను అనకాపల్లి జిల్లాకు చెందిన ఒక వైసీపీ ఎమ్మెల్యే (ప్రస్తుతం మాజీ)తో పాటు నెల్లూరు జిల్లా వాసి కొనుగోలు చేశారు. లేఅవుట్ వేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. అయితే ఆ భూములకు సరైన దారిలేదు. కొద్దికాలం కిందట పక్కనున్న అటవీ భూమిలో రోడ్డు వేసేందుకు యత్నించడంతో కేసు నమోదు వరకూ వెళ్లింది. అయినా వెనక్కి తగ్గకుండా నెల రోజులుగా దాని పక్కనున్న సర్వే నంబరు 37లో గల కొండను తొలిచి, గెడ్డలను పూడ్చి సుమారు 80 అడుగుల రోడ్డును నిర్మించేశారు. ఆ రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ, పంచాయతీ అనుమతులు లేకపోవడం గమనార్హం. కూటమి పాలనలో వైసీపీ నాయకులు బరితెగించి ప్రభుత్వ భూమి కబ్జా చేయడం విస్తుగొలుపుతుంది. కాగా కొంతమంది స్థానికులు అందించిన సమాచారం మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. పెద్దఎత్తున కొండను తవ్వి రోడ్డు నిర్మించినట్టు నిర్ధారించారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ శ్రీనుబాబును వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ రోడ్డు నిర్మాణానికి రెవెన్యూపరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

భూ కబ్జా చేయడానికి చూస్తున్నారు.

లక్ష్మి, గ్రామస్థురాలు

రోడ్డు నిర్మాణం కోసం తన భూమిని విక్రయించలేదని కబ్జా చేయడానికి చూస్తున్నారని గ్రామానికి చెందిన వరపుల లక్ష్మి ఆరోపించారు. తమకు పెద్దల వద్ద పలుకుబడి ఉందని, అవసరమైతే భూమిలో నుంచి వెళ్లగొడతామని బెదిరిస్తున్నారని వాపోయింది. వారి నుంచి రక్షణ కల్పించాలని కోరింది.

# ఎస్ఎఫ్ఐ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ ఏబీవీపీ ఆందోళన

**విభాగాల్లో ఎస్ఎఫ్ఐ కరపత్రాలు పంపిణీ చేయడంపై ఏబీవీపీ అభ్యంతరం**

**మరోసారి ఇరు సంఘాలకు చెందిన నేతల తోపులాట**

**రిజిస్ట్రార్‌కు పరస్పరం ఫిర్యాదులు**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 20 ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థి సంఘాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది. గడిచిన కొద్దిరోజులుగా ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ/ఏఐఎస్ఎఫ్ నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొని ఉంది. ఏబీవీపీకి చెందిన నేతలు ఆర్ఎస్ఎస్ శాఖ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ/ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఏయూ వీసీ కార్యాలయం ఎదుట ఇరువర్గాలకు మధ్య తోపులాట జరిగిన విషయం తెలిసిందే. తప్పు చేసిన వారిపై చర్య తీసుకుంటామని, ఈ తరహా చర్యలకు స్వస్తి చెప్పాలని ఇరు సంఘాల నేతలకు వర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో గొడవ సర్దుమణిగిందని అంతా భావించారు. అయితే, తమపై దాడికి పాల్పడిన ఎస్ఎఫ్ఐ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ గోపి, జిల్లా కన్వీనర్ నితిన్, నగర కార్యదర్శి ప్రసాద్‌తోపాటు పలువురు శుక్రవారం ఉదయం ఏయూ ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ గూండాలపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ గూండాల పేరుతో తయారుచేసిన దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ఏబీవీపీ నాయకులు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఏబీవీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో ఏయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని పాలిటిక్స్ విభాగంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారన్న విషయం తెలియడంతో అక్కడకు వెళ్లి వారిని అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాలకు చెందిన నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఇరువర్గాల నాయకులు వేర్వేరుగా రిజిస్ట్రార్‌ను కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ వినతులు సమర్పించారు. వారి వాదనలు విన్న రిజిస్ట్రార్ తప్పు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇమ్మాన్యుయల్ రాజీనామా చేశారు. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని రిజిస్ట్రార్ కె.రాంబాబు వెల్లడించారు.

వివాదాల్లో తలదూర్చవద్దు: రిజిస్ట్రార్

విద్యార్థులు తమ పూర్తి సమయాన్ని, సామర్థ్యాలను కెరియర్‌ను నిర్మించుకునే దిశగా వినియోగించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు సూచించారు. విద్యార్థి సంఘాల గొడవల నేపథ్యంలో ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్సిటీలో ఉన్న గ్రంథాలయం, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు తెలిసో,తెలియకో వివాదాల్లో భాగం అయితే భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకున్నట్టేనన్నారు.

# ఏడాది చివరికల్లా 5 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు: మంత్రి సత్యకుమార్

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 20: సీతంపేట, పార్వతీపురం, దోర్నాల, రంపచోడవరం, బుట్టాయిగూడెంలోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఈ ఏడాది చివరి కల్లా వినియోగంలోకి తెస్తామని మంత్రి సత్యకుమార్ అసెంబ్లీలో తెలిపారు. గత ప్రభుత్వం రూ.12 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగిలిన నిధులను తమ ప్రభుత్వమే అందించి నిర్మాణాలను పూర్తి చేస్తోందని ఆయన వివరించారు. ఇప్పటికే 300 మంది వైద్యులను నియమించామని, ఇన్‌సర్వీస్, సీనియర్ రెసిడెంట్ల విభాగంలో మరో 600 మందిని ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొన్నారు.

# సినిమా



## చిరంజీవి మీద విషప్రయోగం..

ఏంటి చిరంజీవి మీద విషప్రయోగం జరిగిందా అని ఆశ్చర్యపోతున్నారు కదా..? ఇప్పుడంటే సోషల్ మీడియా యుగం కాబట్టి అన్నీ ఇట్టే తెలిసిపోతున్నాయి కానీ ఒకప్పుడు అవన్నీ ఎక్కడున్నాయి..? అందుకే చాలా విషయాలు బయటికి కూడా రాలేదు. టాలీవుడ్ ఖ్యాతిని శిఖరాగ్రానికి చేర్చిన మెగాస్టార్ చిరంజీవి ప్రస్థానం పూలపాన్పులా సాగలేదనేది అక్షర సత్యం. ఆయన సుప్రీమ్ హీరో స్థాయి నుంచి మెగాస్టార్ హోదాకు చేరుకుంటున్న తరుణంలో ఎన్నో అవాంతరాలను, కుట్రలను ఎదుర్కోవాల్సి వచ్చింది. వాటిలో అత్యంత భయానకమైనది ఆయనపై జరిగిన ఒక ప్రాణాపాయ కుట్ర. సుమారు 28 ఏళ్ళ క్రితం ఆయనను చంపడానికి జరిగిన ఒక విషప్రయోగం అప్పట్లో దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈనాటి తరానికి పెద్దగా పరిచయం లేని ఆ నాటి దారుణ ఘటన తాలూకు వివరాలు ఇప్పటికీ ఇండస్ట్రీలో ఒక చేదు జ్ఞాపకంలా మిగిలిపోయాయి.

ఈ ఉదంతం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 1988వ సంవత్సరంలో చోటు చేసుకుంది. ఆ సమయంలో వరుసగా సూపర్ హిట్లు సాధిస్తూ టాలీవుడ్ నంబర్ వన్ హీరోగా చిరంజీవి తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. సరిగ్గా అదే సమయంలో మద్రాస్ బేస్ కోర్టు పరిసరాల్లో 'మరణ మృదంగం' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తమ అభిమాన నటుడిని నేరుగా చూసేందుకు ఆ రోజు లొకేషన్‌కు ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆ జనసందోహంలోనే ఒక గుర్తుతెలియని వ్యక్తి తన పుట్టినరోజు నెపంతో చిరంజీవి వద్దకు చేరుకున్నాడు. చిరంజీవి చేతుల మీదుగా తన బర్త్‌డే కేక్ కట్ చేయించుకోవాలనేది తన చిరకాల కోరిక అని ఆ ఆగంతుకుడు నమ్మబలికాడు. అభిమానుల పట్ల ఎప్పుడూ ఆప్యాయత చూపే చిరు, ఏమాత్రం సందేహించకుండా అందుకు అంగీకరించారు.

ఆ తర్వాత కేక్ కోసిన ఆ వ్యక్తి, అందులోని ఒక భాగాన్ని బలాత్కారంగా హీరో నోట్లోకి నెట్టే ప్రయత్నం చేశాడు. చిరంజీవి సున్నితంగా వారిస్తున్నప్పటికీ, అతడు వినకుండా మరింత బలవంతం చేయడంతో ఆ కేక్ ముక్క కింద పడిపోయింది. నేలరాలిన ఆ కేక్ ముక్కల నుంచి గోధుమ వర్ణంలో ఉన్న ఒక అనుమానాస్పద ప్యాకెట్ బయటపడటంతో అక్కడున్న చిత్ర బృందం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ కొద్దిపాటి కేక్ పెదాలకు అంటగానే చిరంజీవి పెదవుల రంగు వింతగా మారిపోవడం అందరినీ మరింత భయాందోళనలకు గురిచేసింది. ఇది కచ్చితంగా విషప్రయోగమే అని గ్రహించిన యూనిట్ సభ్యులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయన్ను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించారు. అదృష్టవశాత్తూ తృటిలో పెను ప్రమాదం తప్పిందని వైద్యులు నిర్ధారించారు.

మరుసటి రోజు ఉదయం ఈ ఉదంతం జాతీయ, రాష్ట్ర స్థాయి పత్రికలన్నింటిలోనూ పతాక శీర్షికల్లో ప్రచురితమై తీవ్ర కలకలం రేపింది. చిరంజీవి ఎదుగుదలను ఏమాత్రం జీర్ణించుకోలేని కొందరు గిట్టనివాళ్లే ఈ పన్నాగం పన్నారంటూ పెద్ద ఎత్తున వదంతులు వ్యాపించాయి. చివరకు సినీ పరిశ్రమకు చెందిన కొందరు పెద్దలు జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం నెమ్మదిగా సద్దుమణిగింది. మెగాస్టార్ తన సినీ ప్రయాణంలో కేవలం తెరమీద విలన్లనే కాకుండా, నిజ జీవితంలోనూ ఎన్నెన్నో కుట్రలను ఎదిరించి నిలబడ్డారనడానికి ఈ సంఘటనే ఒక సజీవ సాక్ష్యం. అప్పట్నుంచి చిరంజీవి విషయంలో జాగ్రత్తలు మరింతగా పెరిగిపోయాయి. ఇంత జరిగినా కూడా మెగాస్టార్ మాత్రం ఫ్యాన్స్ విషయంలో ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు.






## కూల్ డ్రింక్స్ తాగితే ఆ సమస్యలు తగ్గిపోతాయా..?

నేటి ఉరుకుల పరుగుల జీవితం, జంక్ ఫుడ్ పుణ్యమా అని ప్రతి ఇంట్లో గ్యాస్, అసిడిటీ కామన్ అయిపోయాయి. కడుపు ఉబ్బరంగా అనిపించగానే చాలామంది చేసే మొదటి పని.. వెంటనే ఒక కూల్ డ్రింక్ బాటిల్ కొని గటగటా తాగేయడం. తాగిన కాసేపటికే ఒక పెద్ద త్రేనుపు రాగానే అబ్బా.. గ్యాస్ పోయింది, హాయిగా ఉంది అని ఫీల్ అయిపోతారు. కానీ అక్కడే అసలు ప్రమాదం దాగి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీకు వచ్చే ఆ త్రేనుపు కడుపులో ఉన్న గ్యాస్ అనుకుంటే పొరపాటే. నిజానికి సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే కార్బన్ డయాక్సైడ్ వాయువు త్రేనుపు రూపంలో బయటకు వస్తుంది తప్ప.. మీ కడుపులోని సమస్య తగ్గదు. పైగా ఇది తాత్కాలికంగా ఉపశమనం ఇచ్చినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో కడుపులో ఒత్తిడిని పెంచి యాసిడ్ రిఫ్లక్స్ వంటి తీవ్రమైన వ్యాధులకు దారితీస్తుంది.

సాఫ్ట్ డ్రింక్స్ ఎందుకు డేంజర్?గ్యాస్ట్రోఎంటరాలజిస్టుల ప్రకారం.. ఈ డ్రింక్స్ తాగడం వల్ల కడుపు లోపల కొన్ని మార్పులు జరుగుతాయి. గ్యాస్ బుడగలు కడుపులో ఒత్తిడిని పెంచి, యాసిడ్ గొంతులోకి వచ్చేలా చేస్తాయి. వీటిలో ఉండే అత్యధిక చక్కెర కాలేయానికి శత్రువు. ఇది ఫ్యాటీ లివర్ సమస్యకు ప్రధాన కారణం. ఇవి స్వతహాగా ఆమ్ల గుణాన్ని కలిగి ఉండి, కడుపులోని సహజ జీర్ణ ప్రక్రియను దెబ్బతీస్తాయి. మరి పరిష్కారం ఏంటి?అసిడిటీగా ఉన్నప్పుడు కృత్రిమ డ్రింక్స్ జోలికి వెళ్లకుండా మన వంటింట్లో ఉండే ఈ సహజ ప్రత్యామ్నాయాలను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు:

అల్లం నీరు: ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

చల్లని పాలు: తక్కువ కొవ్వు ఉన్న చల్లని పాలు తాగితే కడుపులోని యాసిడ్ తటస్థీకరించబడుతుంది.జీలకర్ర లేదా సోంపు నీరు: గ్యాస్ సమస్యకు ఇవి శాశ్వత, సురక్షితమైన పరిష్కారాలు.హెర్బల్ టీ: ఇది కడుపులోని మంటను తగ్గించి చల్లబరుస్తుంది.



## ఉసిరితో జుట్టుకు అద్భుత ప్రయోజనాలు

ఉసిరి జుట్టు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద వైద్యులు వివరిస్తున్నారు. ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, రసాయన సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. రోజుకొక ఉసిరి తింటే జుట్టు బలంగా మారుతుంది. ఉసిరికాయల జ్యూస్ ను డైట్ లో చేర్చుకుంటే జుట్టు వత్తుగా పెరుగుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గించి, పెరుగుదలను ప్రోత్సహించడానికి ఉసిరి పొడి, నిమ్మరసం మిశ్రమాన్ని జుట్టుకు అప్లై చేసి 40 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. కొబ్బరి నూనెలో ఉసిరి చుక్కలు కలిపి మాడుకు పట్టించి, నెలలో నాలుగు సార్లు ఇలా చేస్తే జుట్టు వత్తుగా పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

1. ఉసిరికాయ జ్యూస్ నుండి: కావలసిన పదార్థాలు: ఉసిరికాయలు - 4-5 నీరు - 1/2 కప్పు తేనె లేదా బెల్లం (రుచికి తగినంత) తయారీ విధానం: ఉసిరికాయలను కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయండి. బ్లెండర్‌లో ఉసిరికాయ ముక్కలు మరియు నీరు వేసి బాగా బ్లెండ్ చేయండి. జ్యూస్‌ను వడకట్టి గ్లాసులో పోయండి. రుచికి తగినంత తేనె లేదా బెల్లం కలుపుకోండి. ఉదయం ఖాళీ కడుపుతో ఈ షాట్ తీసుకోండి.



## పుచ్చకాయ అందరికీ మంచిది కాదు.

ఎండల్లో దాహార్తిని తీర్చే పుచ్చకాయ ఆరోగ్యానికి మేలు చేసినా, కొందరికి అంత మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, కిడ్నీ సమస్యలు ఉన్నవారు, జీర్ణకోశ వ్యాధులతో బాధపడేవారు, అతిగా తినేవారు జాగ్రత్త వహించాలి. రాత్రిపూట, ఖాళీ కడుపుతో తినడం మంచిది కాదు. రోజుకు 200-300 గ్రాములకు మించకుండా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గర్భిణీలు, ఆరోగ్య సమస్యలున్నవారు పోషకాహార నిపుణులను సంప్రదించాలి.

జీర్ణకోశ వ్యాధులు: ఇందులో ఉండే 'లైకోపీన్' అధికమైతే గ్యాస్, కడుపు ఉబ్బరం, విరేచనాలకు దారితీస్తుంది. సున్నితమైన కడుపు ఉన్నవారు దీనికి దూరంగా ఉండటమే మేలు.వాటర్ ఇంటాక్సికేషన్: అతిగా పుచ్చకాయ తినడం వల్ల శరీరంలో సోడియం స్థాయిలు పడిపోయి 'వాటర్ ఇంటాక్సికేషన్' అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల కాళ్ల వాపులు, తీవ్రమైన అలసట కలుగుతాయి.

రాత్రిపూట వద్దు: రాత్రి సమయంలో పుచ్చకాయ తింటే జీర్ణక్రియ మందగించడమే కాకుండా, తరచుగా మూత్ర విసర్జన వల్ల నిద్రకు భంగం కలుగుతుంది.

## ముగ్గురు స్టార్ ఆటగాళ్లను పక్కనపెట్టిన సూర్య

2026 టీ20 వరల్డ్ కప్‌లో అసలైన సమరం మొదలైంది. ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానున్న సూపర్-8 దశ కోసం టీమిండియా సర్వసన్నద్ధమవుతోంది. గ్రూప్ స్టేజ్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి టేబుల్ టాపర్‌గా నిలిచినప్పటికీ, భారత జట్టులో కొన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పసికూనలైన అమెరికా, నెదర్లాండ్స్ జట్లు కూడా భారత బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కోవడం మేనేజ్‌మెంట్‌ను ఆలోచనలో పడేసింది. ఈ నేపథ్యంలో సెమీస్ రేసులో నిలవాలంటే కీలకమైన సూపర్-8 మ్యాచ్‌ల కోసం ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఫామ్ లేమితో సతమతమవుతున్న ముగ్గురు కీలక ఆటగాళ్లపై వేటు పడే సూచనలు ఉన్నాయి.

1. అభిషేక్ శర్మ

2025 సీజన్‌లో ఏకంగా 859 పరుగులు చేసి టీమిండియాలోకి మెరుపులా దూసుకొచ్చిన అభిషేక్ శర్మ, వరల్డ్ కప్ వేదికపై మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. గ్రూప్ స్టేజ్‌లో ఆడిన మొదటి మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ కనీసం ఖాతా తెరవకుండానే వెనుదిరిగి డకౌట్ల హ్యాట్రిక్ నమోదు చేశాడు. సూపర్-8లో సవాళ్లు ఇంకా కఠినంగా ఉంటాయి కాబట్టి, సూర్యకుమార్ సేన అతడిని పక్కనపెట్టి యశస్వి జైస్వాల్‌ను తిరిగి ఓపెనింగ్‌లోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. అభిషేక్ ఫామ్ లేమి భారత జట్టుకు పవర్‌ప్లేలో పెద్ద మైనస్‌గా మారింది.

2. రింకూ సింగ్

భారత నమ్మకమైన ఫినిషర్ రింకూ సింగ్ కూడా ఈ టోర్నీలో ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. అమెరికాపై 14 బంతుల్లో కేవలం 6 పరుగులే చేసిన రింకూ, మిగిలిన మ్యాచ్‌ల్లోనూ వచ్చిన స్వల్ప అవకాశాలను వినియోగించుకోలేకపోయాడు. జట్టు కూర్పు దృష్ట్యా రింకూ స్థానంలో వాషింగ్టన్ సుందర్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. సుందర్ బ్యాటింగ్‌తో పాటు అదనపు స్పిన్ బౌలింగ్ ఆప్షన్‌ను కూడా ఇస్తాడు. రింకూకు ఎక్కువ బంతులు ఆడే అవకాశం రాకపోవడం ఒక కారణమైతే, ఆరో బౌలర్ లేకపోవడం టీమ్ ఇండియాకు ప్రతికూలంగా మారింది. కాబట్టి ఆల్‌రౌండర్ కోటాలో రింకూపై వేటు పడవచ్చు.

3. అర్ష్‌దీప్ సింగ్

పేసర్ అర్ష్‌దీప్ సింగ్ భవితవ్యం పూర్తిగా పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంది. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా ప్రధాన పేసర్లుగా కొనసాగుతుండటంతో, సూపర్-8 మ్యాచ్‌లు జరిగే వేదికలను బట్టి అర్ష్‌దీప్‌ను తప్పించే అవకాశం ఉంది. ముఖ్యంగా చెన్నై వంటి స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో (కులదీప్, సుందర్, అక్షర్) వెళ్లాలనుకుంటే, అర్ష్‌దీప్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుంది. శ్రీలంకలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో కూడా పాకిస్థాన్‌పై అర్ష్‌దీప్‌ను పక్కనపెట్టి కులదీప్‌ను ఆడించిన సంగతి తెలిసిందే.




## టీమిండియాకు సూపర్-8 గండం..

టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలు సిసలైన సమరం మొదలైంది. గ్రూప్ స్టేజ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన టీమిండియా, ఇప్పుడు సూపర్-8 గండం దాటాల్సి ఉంది. అయితే ఈసారి పరిస్థితులు చూస్తుంటే భారత అభిమానుల్లో కాస్త టెన్షన్ మొదలైంది. ఎందుకంటే సుమారు 17 ఏళ్ల క్రితం నాటి ఒక చేదు జ్ఞాపకం ఇప్పుడు మళ్ళీ టీమిండియాను భయపెడుతోంది. 2009 తర్వాత మళ్ళీ ఇప్పుడు భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్ జట్లు ఒకే గ్రూపులో చేరడం టీమిండియాకు అతిపెద్ద ముప్పుగా పరిణమించింది.

ఏమిటా 17 ఏళ్ల నాటి బ్యాడ్ సెంటిమెంట్?

టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్ జట్లు సూపర్-8లో ఒకే గ్రూపులో ఉండటం ఇది రెండోసారి మాత్రమే. గతంలో 2009 వరల్డ్ కప్‌లో సరిగ్గా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పట్లో భారత్‌తో పాటు సౌతాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లు ఒకే గ్రూపులో ఉన్నాయి. ఆ టోర్నీలో టీమిండియా ఘోరంగా విఫలమైంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వెస్టిండీస్ చేతిలో 7 వికెట్లతో, సౌతాఫ్రికా చేతిలో 12 పరుగులతో, ఇంగ్లాండ్ చేతిలో 3 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇప్పుడు మళ్ళీ అదే ఈక్వేషన్ రిపీట్ అవ్వడం అభిమానులను కలవరపెడుతోంది.

గ్రూప్ ఆఫ్ డెత్.. అందరూ అజేయులే!

ఈసారి సూపర్-8 గ్రూప్-1ని గ్రూప్ ఆఫ్ డెత్ అని పిలుస్తున్నారు. ఎందుకంటే ఈ గ్రూపులో ఉన్న నాలుగు జట్లు (భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే) గ్రూప్ స్టేజ్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అన్-బీటన్?గా ఇక్కడికి చేరుకున్నాయి. గతంలో లాగా కాకుండా ఈసారి జింబాబ్వే రూపంలో మరో ప్రమాదం పొంచి ఉంది. సికిందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే జట్టు.. ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దిగ్గజ జట్లనే మట్టికరిపించి అజేయులుగా సూపర్-8లోకి దూసుకొచ్చింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా జింబాబ్వే పెద్ద జట్ల కొంపముంచడం ఖాయం.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com